## క్లుప్తంగా

### 'సాధు మంజీరాలు' ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న నల్లనయ్య, తదితరులు

**సీతంపేట :** అమరావతి విశ్వసాహితి ఆధ్వర్యంలో పి.ఎల్.వి.ప్రసాద్ రచించిన 'సాధు మంజీరాలు' పద్య కవితా సంపుటి విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పునకు, మనిషిని సన్మార్గంలో నడపడానికి సాహిత్యం బలమైన సాధనమని పద్య కవిత్వం ద్వారా రచయిత ప్రసాద్ నిరూపిస్తున్నారన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పద్యం తెలుగు జాతి సంస్కృతికి వెన్నెముక అని, శతకం సమాజ సంస్కరణకు బలమైన వాహిక అని తెలిపారు. ప్రముఖ కవి చినసూర్యనారాయణ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఫ్రాన్సిస్, రొంగలి రాములు పాల్గొన్నారు.

### రైతుబజారు స్టాళ్లకు డ్రా



డ్రా తీసి టోకెన్ అందిస్తున్న ఈవో కృష్ణమూర్తి

**సీతమ్మధార :** సీతమ్మధార రైతుబజారులో సోమవారం 140 మంది రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం 70 మంది, సాయంత్రం 70 మంది రైతులు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా దుకాణాలు, స్టాళ్లకు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి డ్రా తీసి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ వారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులు వారికి కేటాయించిన స్టాళ్లలోనే కూరగాయలు విక్రయించాలని స్పష్టం చేశారు. స్టాళ్లు ఉన్న వారు కూరగాయలు నేల మీద విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

### టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో దుకాణాల సీజ్



దుకాణాలకు తాళాలు వేస్తున్న జోన్ - 4 అధికారులు

**సీతమ్మధార :** జీవీఎంసీ జోన్ – 4 పరిధి ద్వారకానగర్ టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో గల పలువురు వ్యాపారులు నెలల తరబడి అద్దెలు చెల్లించడకపోవడంతో ఆ దుకాణాలను అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో జోన్ – 4 రెవెన్యూ విభాగం అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది సోమవారం సీజ్ చేసి తాళాలు వేశారు. టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని 17, 18, 46, 49, 50 నంబర్ దుకాణాల యజమానులు కొంతకాలంగా అద్దెలు చెల్లించకపోవడంతో ఎట్టకేలకు తాళాలు వేశారు. జోన్ – 4 రెవెన్యూ విభాగం ఇన్‌స్పెక్టర్ సీతారామ్ పర్యవేక్షణలో ట్యాక్స్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

### ఘంటసాల వర్ధంతి నేడు



కరపత్రిక ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

**తాటిచెట్లపాలెం :** రైల్వే న్యూ కాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో మంగళవారం ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమాల వివరాలు తెలిపే కరపత్రికను సోమవారం ఆవిష్కరించారు. ప్రతీ సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా గాన సుధ గల్లా చిట్టిబాబు బృంద సభ్యులచే భక్తి గీతాలాపన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### 18న వాహనాల వేలం

**జగదాంబ:** హార్బర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న 9 మోటార్ సైకిళ్లను ఇంత వరకు ఎవరూ క్లెయిమ్ చేయని కారణంగా ఈ నెల 18న మహారాణిపేట తహసీల్దార్ సమక్షంలో బహిరంగ వేలం వేస్తున్నట్టు సీఐ సీహెచ్ సింహాద్రి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మాది జంక్షన్ వద్ద ఉన్న వెహికల్ డంపింగ్ యార్డు వద్ద వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9440796013, 9705332255లో సంప్రదించాలని సీఐ కోరారు.

# నందనవనం




- సుందరంగా స్నీపర్‌పార్కు
- పిల్లలు, పెద్దలకు ఆనందం, ఆహ్లాదం

**సీతమ్మధార : అందాల విశాఖ నగరానికి మరింత వన్నె తెచ్చేలా జీవీఎంసీ 14 వార్డులో గల స్నీపర్** పార్కు స్థానిక ప్రజలకు ఆనందం, ఆహ్లాదం అందిస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ఉత్తర నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాలు, ప్రహరీలు, పార్కులు, మంచి నీటి సౌకర్యం, వాటర్ వర్క్సు పనులు, జనరల్ వర్కులు, ఇతర అభివృద్ధి పనులు గత ఐదేళ్లలో చురుగ్గా జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత ప్రభుత్వం నిర్మించిన స్నీపర్‌పార్కు అందరికీ ఆహ్లాదం పంచుతోంది. పిల్లలు, పెద్దలు ఇక్కడ రోజూ సేద తీరుతున్నారు. సాయంత్రమైతే చుట్టుపక్కల ప్రాంతాల పిల్లలు, పెద్దలు ఇక్కడికి చేరుతున్నారు. పెద్దలు జాగింగ్, వాకింగ్ చేస్తూ, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న మహా విశాఖ నగరానికే ఈ స్నీపర్‌పార్కు తలమానికంగా నిలుస్తోందంటే అతిశయోక్తి కాదు. సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, గురుద్వారా తదితర ప్రాంతాల ప్రజలకు ఈ పార్కు ఆహ్లాదం పంచుతోందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



ఉయ్యాల ఊగుతున్న పిల్లలు



పార్కు లోపలి దృశ్యం

### స్నీపర్ పార్కు ప్రత్యేకతలివే

**జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార దరి నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల స్నీపర్ పార్కు (రాకెట్ పార్కు)లో నాలుగు వాకింగ్ ట్రాక్‌లున్నాయి. ఇక్కడ సీతాకోక** చిలుకల ఉత్పత్తి కేంద్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పిల్లల ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, నాలుగు పెర్గోలాలు, పెవిలియన్, టాయిలెట్స్, గెజిబో, ధ్యానం, యోగా చేసుకునేందుకు వీలుగా థియేటర్, నీటి సరఫరా, బిందు సేద్యం వ్యవస్థ అందుబాటులో ఉన్నాయి. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అప్పటి రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ఎంపీ నిధులతో పార్కు నిర్మించిన విషయం తెలిసిందే.

### సర్వాంగ సుందరంగా..

బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో స్నీపర్ పార్కు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖ మహానగరంలో ఇటువంటి పార్కులు ఎంతైనా అవసరం. ఇప్పటికే నగరంలో ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేసిన జీవీఎంసీ ఆధునిక పార్కులు ఏర్పాటు చేయడం సంతోషకరం.

– వాణి, బాలయ్య శాస్త్రి లే అవుట్

### స్థానికులకు ఉపశమనం

దైనందిన జీవితంలో ఒత్తిడి నుంచి రిలాక్స్ అవ్వడానికి స్నీపర్‌పార్కు ఎంతగానో దోహదపడుతుంది. ఇక్కడ సీనియర్ సిటిజన్స్ వాకింగ్ చేయడానికి ట్రాక్ అనువుగా ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు రొటీన్ లైఫ్ నుంచి రిలాక్స్ అవ్వడానికి, పార్కులో సేద తీరేందుకు అనువైన వాతావరణం ఉంది.

– శాంతి, బాలయ్యశాస్త్రి లే అవుట్

## వైభవంగా లలితా కామేశ్వరుల కల్యాణం



శ్రీలలితాపీఠంలో లలితా కామేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

**సీతంపేట :** శ్రీలలితాపీఠంలో శ్రీలలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పీఠం 76వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి పర్యవేక్షణలో కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. కుర్తాళం పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ వేద మంత్రాల మధ్య లలితా కామేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తకంగా కల్యాణం చేశారు. లలితా కామేశ్వరుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. ముందుగా లలితా కామేశ్వరులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం ప్రాంగణాన్ని, లలితాదేవి సన్నిధిని, దర్బారు హాలును వివిధ రకాల పువ్వులు, పండ్లతో ఆకర్షణీయంగా అలంకరించారు. సుముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కల్యాణం తిలకించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం లలితా అమ్మవారికి 250 కిలోల అన్నాభిషేకం నిర్వహించనున్నామని, మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, సామూహిక కుంకుమ పూజ జరిపిస్తామని పీఠం మేనేజర్ తెలిపారు.

## దిగొచ్చిన కూరగాయల ధరలు




రైతుబజార్‌లో టమాటా స్టాల్

**సీతమ్మధార :** రైతుబజార్లలో కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. మాఘమాసంలో వివాహాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో కూరగాయలకు డిమాండ్ అధికంగానే ఉంటుంది. కానీ దిగుబడులు అధికంగా ఉండడంతో ధరలు క్రమేణా తగ్గుముఖం పడుతున్నాయి. ఉల్లిపాయలు కిలో రూ.32కే లభ్యమవడం విశేషం. ఇక దేశవాళీ, హైబ్రీడ్ టమాటా కిలో రూ.12కి తగ్గిపోయింది. కాలీఫ్లవర్, క్యాబేజీ, ఆనపకాయ కిలో రూ.12కే దొరుకుతున్నాయి. అరటికాయలు ఒక్కటీ రూ.7కి విక్రయిస్తున్నారు. బీట్‌రూట్, బద్ద చిక్కుడు కిలో రూ.28 పలుకుతున్నాయి. క్యారెట్ కిలో రూ.30కి, వంకాయలు తెల్లవి రూ.15, పొడవు రకం రూ.18కి దొరుకుతున్నాయి. వెల్లంకి వంకాయలు కిలో రూ.24కి విక్రయిస్తున్నారు. బంగాళాదుంపలు పాతవి, కొత్తవి రూ.16కి విక్రయిస్తున్నారు. కీరదోస కిలో రూ.26 వంతున విక్రయిస్తున్నారు. దేముడు చిక్కుడు కిలో రూ.28గా ఉంది. కూరగాయల ధరలు తగ్గడంతో వినియోగదారులు అధిక పరిమాణంలో కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు బెండకాయల ధరలు మాత్రం మండిపోతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. కిలో రూ.40కి విక్రయిస్తున్నారు. దొండకాయలు కిలో రూ.32కి, బరబాటి రూ.30కి, కాకరకాయలు రూ.40, బీరకాయలు రూ.46, ఆగాకరకాయలు దేశవాళీ రూ.వంద, హైబ్రీడ్ రూ.50 వంతున విక్రయిస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో నందీశ్వరునికి పూజలు



నక్కవానిపాలెంలో నందీశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకుడు రామారావు శర్మ



శివయ్యకు పూజలు చేస్తున్న అర్చకుడు రాజాస్వామి

**సీతమ్మధార :** జీవీఎంసీ 14వ వార్డులో రామలింగేశ్వరస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు చేశారు. సీతమ్మధార, నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో సోమవారం సాయంత్రం త్రయోదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ముందుగా శివుడికి పంచామృతాభిషేకం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది శివ, తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రామారావు శర్మ ఆధ్వర్యంలో నందీశ్వరుడికి పాలు, పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ దోష నివారణకు నందీశ్వరుడికి పూజలు చేస్తే మంచి జరుగుతుందన్నారు. అర్చకుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టు లేక రాకపోకలకు అవస్థలు



కల్వర్టు లేక ప్రమాదకరంగా తయారైన కాలువ

**సీతమ్మధార :** జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలో మెయిన్ రోడ్డుని ఆనుకుని ఉన్న ప్రాంతంలో కాలువ మీద కల్వర్టు లేక స్థానిక ప్రజలు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. గురుద్వారా జంక్షన్ నుంచి సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో గల ప్రధాన కాలువ మీద కల్వర్టు లేకపోవడంతో పాదచారులు ఆదమరిచి నడిస్తే గాయాల పాలవుతున్నారు. కాలువలో వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వర్షాల సమయంలో కాలువ పొంగి ప్రవహించడంతో మెయిన్ రోడ్డుపైకి వ్యర్థాలు వచ్చేస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. మరోవైపు పక్కనే జరుగుతున్న పైప్‌లైన్ పనుల కోసం తవ్విన గోతులు ఇంకా పూడ్చలేదు. కాలువ పక్కనే రాళ్లకుప్పలు పేరుకుపోవడంతో ట్రాఫిక్‌కి అవస్థలు తప్పడం లేదని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ



వర్మ కాంప్లెక్స్ సమీపంలో డంపర్ బిన్ వద్ద వ్యర్థాలు



పట్టాభిరెడ్డితోటలో రహదారిపై చెట్ల కొమ్మలు

**మురళీనగర్ :** మురళీనగర్ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఆదివారం పూట పారిశుధ్యం మెరుగుకు సరైన చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల దుర్వాసన భరించలేకపోతున్నామని, రోడ్లపై రాకపోకలు సాగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాధవధార – మురళీనగర్ 48వ నంబరు బస్సు రూటులో వర్మ కాంప్లెక్సు సమీపంలో డంపర్ బిన్‌లోని వ్యర్థాలు రహదారిపై పేరుకుపోయినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఈ ప్రాంతంలో పేరుకుపోయిన వ్యర్థాల వల్ల పరిసరాల్లో దుర్గంధం వ్యాపించడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టాభిరెడ్డితోట రహదారిని ఆనుకుని చెట్ల కొమ్మలు తొలగించి అలానే వదిలేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతుబజార్ రోడ్డులో ట్రాఫిక్ గందరగోళం



రైతుబజార్ రోడ్డులో గందరగోళంగా వాహనాల రాకపోకలు

**సీతమ్మధార :** స్థానిక రైతుబజార్ రోడ్డులో ఆక్రమణలకు అడ్డు లేకుండా పోతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆక్రమణలు కారణంగా సీతమ్మధార రైతు బజార్ నుంచి నక్కవానిపాలెం వెళ్లే 60 అడుగుల రోడ్డు చిక్కిపోతోందని వాహనదారులు వాపోతున్నారు. సీతమ్మధార నుంచి తూర్పు వైపు వెళ్లే రోడ్డు నిత్యం ట్రాఫిక్ జామ్‌తో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కి ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీసులు పదే పదే ప్రకటనలు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి మారడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రోడ్డుకి ఇరువైపలా అధిక సంఖ్యలో నిమ్మకాయలు, కూరగాయలు, ఆహార దినుసులు విక్రయించే స్టాళ్లు, తోపుడు బండ్ల కారణంగా నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోందని ఆందోళన చెందుతున్నారు. చాలా మంది వినియోగదారులు వాహనాలు దిగకుండానే కొనుగోళ్లు చేయడంతో వెనుక వచ్చే వాహనచోదకులు ఒక్కసారిగా హారన్ల మోత మోగించడంతో ఈ ప్రాంతం శబ్ద కాలుష్యంతో మార్మోగిపోతోందని స్థానిక ప్రజలు, పాదచారులు వాపోతున్నారు. ఈ మార్గంలోనే జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థకు చెందిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ కూడా ఉంది. దీంతో ఈ వసతిగృహం సిబ్బంది, ఉద్యోగినులు కూడా అధిక సంఖ్యలో ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తారు. ఇప్పటికైనా ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నులి పురుగుల నివారణకు మాత్రల పంపిణీ



మధురానగర్‌లో మాత్రలు మింగిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



చిన్నారులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ వెంకటేష్

**సీతంపేట :** నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక మధురానగర్‌లో గల జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, సీఎంవోహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, డాక్టర్ హారిక, ఎంఈవోలు రామారావు, బాలామణి, హెచ్‌ఎంలు శాంతికుమారి, దేముడుబాబు పిల్లలతో మాత్రలు మింగించారు. హైస్కూల్‌లో 442 మందికి, ప్రాథమిక పాఠశాలలో 131 మందికి మాత్రలు మింగించినట్టు హెచ్‌ఎంలు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో హెచ్‌ఎం శాంతి కుమారి, ఏఎన్‌ఎం నాగలక్ష్మి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. మధ్యాహ్నం భోజనం అనంతరం 212 మంది పిల్లలకు మాత్రలు మింగించారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో...**

**మద్రిపాలెం:** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం ఏటా ఫిబ్రవరి 10న నిర్వహిస్తామని 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆయన ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల వల్ల పోషకాల లోపం, రక్తహీనత, నీరసం, కడుపునొప్పి వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. చిన్నారులకు ప్రతి ఆరు నెలలకోసారి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ పద్మావతి, ఏఎన్‌ఎం స్రవంతి, ఆశావర్కర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, చిన్నారులు పాల్గొన్నారు.

**ఆల్బెండజోల్‌తో నులి పురుగుల నివారణ**

**సీతమ్మధార :** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు డి.అనురాధ, శుభార్త మణి సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. రక్త హీనత, నీరసం రాకుండా నులి పురుగుల నివారణ కోసం ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.జగదీశ్వరరావు పాఠశాలను సందర్శించి నులిపురుగుల మాత్రల పంపిణీ తీరుతెన్నులు పరిశీలించి వెళ్లారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల సర్వే




దండుబజార్‌లో పర్యటిస్తున్న వెంకట శేషమ్మ, తదితరులు

**విశాఖ లీగల్ :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల గుర్తింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 24 వరకు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలి రోజు అవగాహన కల్పించేందుకు దండుబజార్, మహారాణిపేటలలో పర్యటించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కేజీహెచ్ పిల్లల వార్డు వైద్యులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు పాల్గొన్నారు.

## • అపూర్వ కలయిక



ఆనాటి ఉపాధ్యాయులతో 2000 - 01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

**కంచరపాలెం :** స్థానిక కంచరపాలెం పరిధి సాంబమూర్తినగర్ పోర్ట్ క్వార్టర్స్‌లో గల జీవీఎంసీ కె.కాలనీ ఉన్నత పాఠశాలలో 2000 – 2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో కలుసుకున్నారు. పాఠశాలను వీడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున వారి జ్ఞాపకాలు, అనుభవాలను చిన్ననాటి స్నేహితులతో పంచుకున్నారు. ఆత్మీయ కలయికలో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఆనాటి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.ఎస్.కె శాస్త్రిని ఘనంగా సన్మానించుకుని ఆయన దీవెనలు పొందారు. ఆనాటి పాఠశాల చిత్రంతో జ్ఞాపికలను ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నిర్వాహకులు అందజేశారు.

### వైద్యులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శివానంద్

**మహారాణిపేట :** కేజీహెచ్‌లో వైద్యులు సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. సోమవారం కేజీహెచ్‌లో పలు విభాగాధిపతులు, వైద్యులు, ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. రోజూ ఇక నుంచి ఒక డిప్యూటీ సూపరింటెండెంట్, డీసీఎస్ఆర్ఎంవోలు ఓపీలను సందర్శించి, అక్కడ వైద్యుల సమయపాలన, రోగుల ఇబ్బందులను ప్రత్యేక ఫార్మేట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆ నివేదిక ప్రకారం వైద్యులు, నర్సింగ్, ఇతర మెడికల్, పారా మెడికల్ సిబ్బంది విధులపై నిఘా ఉంచుతామన్నారు. కేజీహెచ్‌లో సెక్యూరిటీ సిబ్బంది విధుల మీద కూడ నిఘా ఉంటుందన్నారు.

## నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలి

**మహారాణిపేట :** రోజురోజుకీ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అరకొరగా నిత్యావసర సరకులు అందివ్వడం సరి కాదన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం తరహాలో 14 రకాల సరకులను రేషన్ కార్డుపై ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.